అందే గోపాల కృష్ణమూర్తి

బీచ్‌లో ఎలక్ట్రిక్‌పోల్ చుట్టూ గుంపుగా కూర్చున్న అరడజనుమంది అబ్బాయిల్ని చూసి 'బాబోయ్ అబ్బాయిలు!' అన్నది అపర్ణ.

'అదేవిటోయ్ అబ్బాయిలంటే అంత భయం? వాళ్ళేమన్నా కొరుక్కు తినేస్తారా, నమిలి మింగేస్తారా మనల్ని? మనం బీచ్‌లో కొచ్చేం, వాళ్ళూ వచ్చేరూ! దేనికంత భయం?' కనుబొమ లెగురవేస్తూ ఘరానాగా అడిగింది ఉష.

'నీకు తెలీదు, వాళ్ళు మనల్ని ఏడిపిస్తారేమోనోయ్?' జంకుతూ వడక నెమ్మది చేసింది ఇందిర.

'ఏడిపిస్తే ఏడవకూ! నువ్వూ వాళ్ళని ఏడిపించూ, బేలన్సు సరిపోతుందీ!' ధిమాగా అన్నది ఉష, కాన్వెంట్ కాలేజీలో చదివిన నాల్గేళ్ళ అనుభవాన్నీ చాటి చెప్తున్నట్టుగా.

'హోయబ్బో!—అబ్బాయిల్ని ఏడిపించడమే, అందులో క్రొత్తగా జేరిన మనం వాళ్ళని ఏడిపించడమా, ఉష మరీ ఛడాయిలేస్తూ!'—జాహ్నవి ఉష 'ధిమా'ను తగ్గించే ప్రయత్నం చేసింది.

'ఏవర్రోయ్, మనం వచ్చినట్టు, అవిగో, ఆ మెట్లుదిగి, ఆ పార్కులోకి వెళ్ళాలంటే, వాళ్ళ పక్కనుంచే వెళ్ళాలి, వాళ్ళప్పుడే చూడు, మనవైపెలా చూస్తున్నారో?'—అంతకు ముందునుంచీ వాళ్ళనే చూస్తున్న శాంతి కామెంట్రీ ఇచ్చింది.

'నడవండోయ్, ఎవరేమంటారో చూద్దాం—' నడుం బిగించి, ఝాన్సీ—కీ-రాణి లాగ ముందుకు నడిచింది ఉష.

'లెట్స్ సీ ద ఫన్'— శాంతి మిగతా వాళ్ళవైపు చూస్తూ, 'ఆంగ్లో ఇండియన్ అమ్మాజీ' లా భుజాలెగుర వేసింది.

అబ్బాయిల తాలూకు కళ్ళజోడు చూపులూ, కళ్ళజోడు లేని చూపులూ, సిగరెట్ పోజులూ—అన్నీ తనమీదే పడే సరికి అమ్మాయిల నడకలో అదోలాంటి మార్పు ఆటోమేటిక్‌గా వచ్చేసింది. అందరి కంటె ముందున్న ఉష మరికాస్త బిగుసుకుపోయి 'టక్, టక్, టక్' మంటూ మెట్లు దిగ సాగింది.

'హూ ఇజ్ దిస్ పింగ్—పాంగ్ బాల్?' అన్నదో అబ్బాయి కంఠం.

వెంటనే మరొక కంఠం—'ఒకమ్మాయి తలమీద గోరింకా, చెప్పకు చెప్పకు చిన్న పాపా!' అని రాగయుక్తంగా పాడడం, ముందున్న ఉష దగ్గర్నించి, చివ్వరనున్న జాహ్నవి వరకూ ఏదో 'అసంకల్పిత ప్రతీకార చర్య'లా, అనుకోకుండా ఆగిపోయి తలలు తడిమేసుకొని, ఆనక ఒకళ్ళ తలలు మరొకళ్ళుకూడా తడుంకొని, ఎవరి తలమీదా గోరింకలుగానీ, కాకులు గానీ లేవని క్షణంలో నిర్ధారణ చేసికొని అంతలోనే ఏదో జయించిన వాళ్ళలా నవ్వేసుకుని మురిసిపోతున్న అబ్బాయిల్ని చూసి మూతి ముడుచుకొని, అనుకో

ఉండవే వాళ్ల 'జెర్క్' తినేసినందుకు 'ఆనక నవ్వుకుందాంలే' అన్నట్టు కళ్లి కట్టుగా ముందుకు పరుగెత్తినంత పనీ చేసేరు.

'జెర్కు గొప్పగా తినేసేరు గురూ గోపాలం!' అన్న అబ్బాయిల గుంపులోంచి వచ్చిన డైలాగు విని, 'ఊహూ, మనమీద విట్టేసేసే నన్నుకున్న వాడిపేరు గోపాలమన్నమాట!' అన్నది ఉష, ప్రక్కనున్న ఇందిరా, శాంతిలతో.

'ఏవోయ్ ఉషడూ, పేద్ద ఏదో అనేసేవ్, ఏం చేయగలేవ్? అందరి కంటె ముందుగా పరుగెట్టేసేవ్, వాళ్ళు విట్టేసేసరికి!' దెప్పింది జాహ్నవి.

'అదివిట్టా? చచ్చువిట్టు, ఆడారి పొట్టు!' ఉక్రోషంగా అన్నది ఉష.

'విట్లలోకూడా ఆడా, మగా ఉన్నట్టు ఇప్పుడు తెల్సిందిగాని, ఒప్పేస్కో, వాళ్ల ముందు నువ్వేం చేయలేవని...' పుర్కెక్కించింది జాహ్నవి.

ఉష మనసంతా పాడైపోయినట్లైంది. ఆ అబ్బాయిల గుంపుని — ముఖ్యంగా ఆ గోపాలాన్ని—నమిలి మింగేయాలన్నంత కోపమొచ్చింది. ఆ కోపమే ఉషలో విపరీతమైన సీరియస్‌నెస్‌కు కారణమై కూర్చుంది. అందుచేతనే మిగిలిన అమ్మాయిల బృందమంతా పాటలు పాడుకొంటూ కేరింతాలు కొడుతూ, అలల మీదకు పరుగులెత్తుతూ 'హాయి' ననుభవిస్తుంటే, అదేమీ తనకు పట్టనట్టు నిర్లిప్తంగా ఒడ్డులో కూర్చుండిపోయింది ఉష.

'అదేమోయ్, అలా డల్‌కొట్టేసేవ్?' తడిచిపోయిన చీరకుచ్చెళ్లను అలాగా పిండుకొంటూ వచ్చి అడిగింది శాంతి.

'ఏమీలేదు, ఇందాక ఆ కుర్రాళ్లు విట్టేసేరుకదా, దానికి బదలా తీర్చడమెలాగా అని ఉష ఆలోచిస్తున్నది, అంతే సంగతి!' జాహ్నవి గాలిలా వచ్చి వాలింది.

'పదు చెప్తా నీపని!' అంటూ లేచింది ఉష. కిసుక్కున్నవ్వింది జాహ్నవి. 'డిస్కరేజ్ చేయకోయ్ జాహ్నవి' అంది శాంతి. మిగిలినవాళ్లంతా కూడా వచ్చి జేరేక, వెనక్కు బయల్దేరింది అమ్మాయిల బృందం.

విలక్ర్ కిక్‌పోల్ కున్న ట్యూబ్‌లైటు— ఎవరో బ్రహ్మాండమైన విట్టు వేసేరు గామోసు, సడన్‌గా వెలిగింది. ఆ లైటు వెలుగులో అబ్బాయిల తాలూకు ముఖాలు ఇంచుమించు స్పష్టంగా కన్పడ్తున్నయ్.

అబ్బాయిలంతా సడెన్‌గా సైలెంట్ అయి కూర్చునేసరికి 'ఓహో, ఇందాకటి గోపాలం మరొక 'విట్టేదో' వండేడు గామోసు, అది మనకి వడ్డించడాన్కి ఏర్పాట్లు చేస్తున్నాడు!' అన్నది ఉష కోపంగా అటువైపు చూస్తూ.

'ఇదిగో, ఎంతమంది విట్టేసినా ఈసారెవ్వరూ నవ్వొద్దు ప్లీజ్!' బ్రతిమాలింది ఉష. ఉష బాధను చూసి 'ఓ.కే' అంటూ నవ్వుకొన్నారు శాంతీ, అపర్ణా, జాహ్నవీలు.

'శాంతీ, నువ్వు నాతో నడవ్వోయ్' వీళ్లంతా ముందు నడుస్తుంటారు, వెనకాల మనమిద్దరం ఉంటాం. ఆ గోపాళం విట్టేస్తే 'రిజెక్ట్' చేసేస్తా!'అంటూ 'ఎజెండా' తయారు చేసింది ఉష. మళ్లీ 'ఒకే' అన్నారు మిగిలినవాళ్లు.

ఇందిర, అపర్ణ, జాహ్నవి వర్సగా ముందు నడుస్తుంటే, రెండడుగుల వెనగ్గా శాంతి, ఉష నడవసాగేరు. అబ్బాయిలు కూర్చున్న 'లైటుపోల్' దగ్గరవుతున్న కొద్దీ ఇందిర, అపర్ణా బిగుసుకు పోసాగేరు. వస్తున్న నవ్వును బలవంతంగా రుమాల్లోకి కుక్కేసుకో సాగింది జాహ్నవి. బుర్ర ప్రక్కకేమాత్రం తిప్పకుండా 'గజంబద్ద మింగేసినట్టు' నడవసాగింది శాంతి. ఉష మాత్రం శాంతితో మాట్లాడ్తున్నట్టుగా నటిస్తూ, గుంపులో గోపాలం ఎవరో గుర్తించాలనే ప్రయత్నంలో నిమగ్నమైపోయింది.

మెట్లొచ్చేసినయ్. అమ్మాయిల్లో సగం మందికి చెమట్లు పట్టేసినయ్. సీరియస్‌గా మెట్లెక్కుతున్న అమ్మాయిలు... ఒకటీ...రెండూ...మూడు ... నాల్గూ...

'వీరీ వీరీ గుమ్మడిపండూ, వీరి పేరేవరూ!' అన్నాడో అబ్బాయి—చివర్నున్న అమ్మాయిని చూపిస్తూ.

ఎప్పుడు నవ్వేద్దామా అని కాచుక్కూచున్నట్టున్న జాహ్నవి ఫక్కున్నవ్వేసి, కాలు మెలికపడి, పక్కనున్న ఇందిరమీద పడిపోయింది. 'అబ్బ ఉండవ్వోయ్!'

# పాపం పైలట్

అంటూ సిగ్గుపడిపోయింది ఇందిర—

'...వీరిపేరు...ఆ—పింగ్‌పాంగ్‌బాలు...' అన్నాడు మరో అబ్బాయి.

'పింగ్‌పాంగ్ బాల్లూ, పారి పో!'అన్నాడు మొదటి అబ్బాయి. జాహ్నవి, ఇందిర, అపర్ణ ముందుకు పారిపోయారు.

ఉష సీరియస్సైపోయి ఆగిపోయింది. ఆ లైటు కాంతిలో మొదటి అబ్బాయి వైపు తీక్షణంగా చూసింది. రెండు గుటకలు మ్రింగి, ఆ అబ్బాయికి కళ్లజోడున్నట్టు గమనించి, 'చూడు శాంతీ, భూతద్దాల కళ్లజోడుంటే ఎక్కడైనా సంపాదించు, మనరూమ్‌లో సినిమా వేసుకుందాం!' అన్నది శాంతి భుజంమీద చరుస్తూ.

శాంతి 'పకపకా' నవ్వేసింది. 'పోన్లే రేపు ట్రై చేసుకొందాం, నడు!' అంటూ విజయోత్సాహంతో ముందుకు సాగిపోయింది ఉష. 'ఏవిటిగురూ, దారుణం?' అంటున్న అబ్బాయిల కంఠాలు ఉషకెంతో ఆనందాన్ని కలిగించినయ్.

'డిపాజిట్లు పోయినియ్ గురూ గోపాలం!'

'ఓకే, ఓకే — లెట్స్ సీ — టుమారో!' అంటూ ఆలోచనలో పడ్డది అబ్బాయిల బృందం.

* * *

బీచ్‌లో జరిగిన సంఘటనను విజయోత్సాహంతో 'టముకు' వేసింది ఉష, ఆర్రాత్రి టెర్రేస్‌మీద జేరిన జనాలతో.

'అమ్మ బాబోయ్, వాళ్లజోలికి పోయేవా నువ్వు?' అడిగింది ఉషను, సుందరి అనే సీనియర్ అమ్మాయి.

'ముందు వాళ్లే మాజోలికొచ్చేరు. అందులోనూ ఆ గోపాలం అట...'

'ఎవరూ, మన 'పైలెట్' వాళ్లనా? ఐతే, రేపట్నుంచి ఉష పని సరి!' అన్నదో సరస్వతి.

'పైలెట్ ఏవిటీ?' అడిగింది ఉష.

'అదీ, ఆ గోపాలాన్కి సుందరి పెట్టిన పేరు, అతనెప్పుడూ మా వెనక పడకుండా ముందే నడుస్తుంటాడు, అప్పుడప్పుడు స్కూటర్‌మ మా బస్‌కుముందే పైలెట్‌లా నడిపిస్తుంటాడు. అందుకు మేం అతన్ని 'పైలెట్' అని రిఫర్ చేస్తుంటాంలే. ఆ పేరు గనక అతనిదగ్గరంటే, కొంతలంటుకు పోతయ్, తర్వాత నీ ఇష్టం—' అన్నది సరస్వతి.

'అలాగా!' అన్నది ఉష ఏదో ఆలోచిస్తూ.

'కావలిస్తే రేప్పొద్దున్న తొమ్మిది ముప్పై అయిదుకి మన బస్సును హాస్టల్ జంక్షన్‌దగ్గర ఒక స్కూటరు క్రాస్ చేసి, దూసుకు పోతుంది, దాన్ని నడిపే అతనే పైలట్, రేపే కాదు, ఏరోజైనా సరే, అదే టంక్షనూ, అదే స్పీడూ, అదే టైమూ, అదే పైలట్టూను!...'

'అహా!' అంటూ మూతిని 'చిన్ని సున్నా'లా చుట్టి బుగ్గమీద వేలేసుకొని, ఆలోచనలో పడ్డది ఉష.

* * *

మర్నాడు ప్రొద్దుటే లేచి తలంటుకొని పాలుబడ వేసికొన్నది ఉష. మనసులో ఒకమూల గోపాలం ఇంచుమించు చోటు చేసుకున్నాడో ఏమో, 'ఈవేళ పైలట్ అనబడే ఆ గోపాలం మనల్ని అల్లరి చేస్తాడు. అదిమాత్రం వీళ్లమాటల్ని బట్టి ఖాయం, అందుచేత...కాస్త డీసెంట్‌గా డెకరేట్ చేస్కోవాలి!'— అనుకొన్నది. అనుకోంటూనే సూట్‌కేస్‌లోంచి రోజాకలర్ జార్జెట్ శారీ, దానికి మేచింగ్ జాకెట్ తీసి 'ఫెమినా' అట్టమీద బొమ్మలా తయారైంది. హాస్టల్ గార్డెన్‌లోంచి ఎర్రగులాబీ ఒకటి సంపాదించి, జడ కుడివైపు చెవిప్రక్కన జారిపోతున్నట్టుగా ఉండేట్టు ఏర్పాటు చేసింది. హాస్టల్ బస్ రాగానే అందరికంటే ముందుగా వెళ్లిపోయి కుడివైపు ఫ్రంట్‌సీటులో కూర్చుండి పోయింది. 'ఒకవేళ 'స్కూటర్—పైలట్' బస్‌ని ఓవర్‌టెక్ చేయాలంటే, బస్‌కి కుడివైపు నుంచే దూసుకు పోవాలిగా! అందుచేత ఈసీటే మంచిది!' అనుకొని ప్రక్కన శాంతికోసం సీటు అట్టేపెట్టింది.

తొమ్మిదిన్నరకి రంగురంగుల, రకరకాల భామినీ బృందంతో బస్ స్టార్టయింది. మెల్లగా హాస్టల్ జంక్షన్ వదిలింది. వెనకసీట్లోంచి సుందరి ఉష వైపు నవ్వుతూ అదోలా చూసింది. బస్ మెల్లగా 'గోపికానగర్' వదిలి 'కృష్ణ

నగర్ ప్రవేశించింది. 'యువర్ ఎటెన్షన్ ప్లీజ్!' అని ఉషవైపు చూసి గట్టిగా అన్నది సుందరి.

ఇందాకట్నించీ ఎటెన్షన్‌లోనే ఉన్న ఉష కంగారుగా బైటకి చూసింది. బస్సు హాస్పిటల్ జంక్షన్‌కొచ్చి ఒక్క నిముష మాగింది. ఎవరెక్కారో పట్టించుకో కుండా స్కూటర్‌కోసం ఆదేపనిగా బైట రోడ్డువైపు చూడసాగింది ఉష. బస్ కదిలింది. ఏదో మోటర్‌సైకిలూ, రెండు అంబేసడర్ కార్లూ, రెండు సైకిల్ రిక్షాలూ, ఒక ఆటో, జాలీ ఎక్స్‌ప్రెస్ తోపుడుబండీ—ఇవన్నీ దాటుకుంటూ బస్ వెళ్ళిపోతున్నదిగాని పైలట్ స్కూటర్ ఎంతకీ రాకపోయేసరికి సుందరివైపు ఆశ్చర్యంగా చూసింది ఉష. బస్ 'ఎల్లిస్ గార్డెన్'—అదే—ఎల్లమ్మతోట—జంక్షన్ దాటి పోయేక 'ఎయిత్‌వండర్ ఆఫ్ ద వర్ల్డ్—ఈవేళ పైలట్ రాలేదు!' అన్నది సుందరి—అందర్నీ ఉద్దేశించి. 'నిజమే, నిజమే!' నంటూ కోరస్ పాడేరు సీనియర్ కంఠాలు.

'సరిగ్గా ఈవేళే రాకపోవాలా! ఎందుకు రాలేదు చెప్మా?' ననుకొని విసుక్కొన్నది ఉష.

'అడుగో పైలట్!' కంగారుగా విన్పడిన శాంతికంఠం విని, ఉలిక్కిపడి అటు తిరిగింది ఉష.

స్కూటర్‌మీద నల్లటి లావుపాటి శాల్తీని చూపెట్టి ఫక్కుమన్నవ్వింది శాంతి.

'పోవోయ్, బోడి విట్టూ నువ్వూను! వాకిలా 'జెర్క్' ఇచ్చేవంటే ఆఁ... చూస్కోమరి!' అంటూ ఉడుక్కున్నది ఉష, మూతిని చిన్ని సున్నాలా చుట్టి.

బస్ కాలేజి కేంపస్ జేరుకొన్నది. ఉషా, శాంతీ చెంగున బస్‌నుండి దుముకుతుంటే, 'ఆఁ ఆఁ ఆఁ...' అన్నారెవరో ప్రక్కనుండి.

అతుకు ముందుకువేస్తూ ప్రక్కకు చూసింది ఉష! 'అడుగోనే పైలట్' అన్నది సుందరి. చటుక్కున అటు తిరిగింది ఉష.

'స్కూటర్‌మీంచి అలా దుమికితే కాలు బెణుకుతుందోయ్ మురళీ, అనక కావడం అమృతాంజనం వానా త్యూతనామ! కాస్త జాగ్రత్తగురూ!' అంటున్నాడు పైలట్ వెనకనున్న అబ్బాయితో.

ఆమాటలు తన నుద్దేశించే అంటూ వెనకాల కుర్రాణ్ణి 'డిఫెన్స్'లో పెట్టే డని ఇట్టే గ్రహించిన ఉష, 'నువ్వా నాయనా పైలట్ అంటేనూ! నీ పని చెప్తానుండు!' అనుకొన్నది మనసులో.

* * *

లంచ్‌టైముకి కేంటీన్‌కి బయల్దేరిన ఉష శరవేగంతో తనను దూసుకుపోయిన స్కూటర్‌ను చూసి అదిరిపడింది.

'ఇంకెవరూ పైలట్టే!' అన్నది శాంతి.

'ఊళ్లో ఇంకెవర్కీ స్కూటరు లేనట్టూ! డొక్కుస్కూటరూ వీడూను!' తిట్టుకొన్నది ఉష.

'స్కూటరుకేమే, బాగానే ఉన్నది, ఎటొచ్చీ—ఆ పైలట్టే—గొట్టం పంట్లాం, గందరగోళమూను!' అన్నది శాంతి.

కేంటీన్ లేడీస్‌వింగ్ ప్రక్కనే బైట నిల్చొని ఎవరితోనో అర్జెంటుగా మాట్లాడేస్తున్న 'పైలట్'ని చూసి 'మళ్లీ ఏం నిక్కేస్తాడో ఏమోనే బాబూ!' అన్నది ఉష.

పైలట్ తమవైపు చూడకపోయేసరికి ఉష మనసు రవంత చివుక్కుమన్నా 'పోన్లే, ఏదో వ్యవహారం గావోసు, అర్జెంటుగా మాట్లాడుతున్నాడు'—అని సర్దిపుచ్చుకొని లోపలికెళ్లింది.

'అబ్బ, ఈ అబ్బాయి లేవిటో! లేడీస్ సెక్షన్‌లో అమ్మాయిలకంటే ముందుగా వీళ్లే తయారు!' మెల్లగా శాంతి చెవిలో విసుక్కొన్నది ఉష.

'ఉష్! వాళ్ళు వింటే గొడవ చేస్తారే! కీప్‌క్వైట్, బోల్డు ఖాళీ ఉందిగా!' అన్నది శాంతి. ఇలోగా సర్వర్‌కి ఏవేవో తెమ్మని ఆర్డరిచ్చింది ఉష.

నాల్గైదు నిముషాలు గడిచేయ్! గుమ్మంవైపు చూసిన ఉష గుండెలు ఝుల్లుమన్నయ్! ఎదురుగా—పైలట్—బృందం!

'హాయ్' అంటే 'హాయ్!' అంటూ ఇందాకటి గుంపుగా జేరిపోయింది పైలట్ బృందం.

'వచ్చేరు!' అనుకొన్నది ఉష.

'రసగుల్లా విత్ ఐస్‌క్రీం సర్వరూ!' అన్నాడు పైలట్. 'ఈయనగారి సొక్కే రసగుల్లా ఒకటి!' అని శాంతి చెవిలో గుసగుస లాడింది.

సర్వర్ స్వీట్‌ప్లేట్ తెచ్చి గోపాలం ముందుపెట్టి వెళ్లిపోయాడు.

'వాటీస్‌దిస్.' అన్నాడు గట్టిగా గోపాలం, స్వీట్‌ని బైటకు తీస్తూ.

అందరూ అటు చూసేరు. ఉషా శాంతియుకూడా అటే చూసేరు.

'ఐసీ—దిస్ ఈజ నాట్ రసగుల్లా—బట్...'

'దెన్ వ్వాట్?' అన్నాడు ప్రక్కబ్బాయి.

'లుక్! దిసీజ...ఎ...పింగ్ పాంగ్ బాల్!' అంటూ పాకంలోంచి తీసిన పింగ్‌పాంగ్‌బాల్‌ని టేబిల్‌మీద వేస్తూ కొట్టేడు గోపాలం. అది తిన్నగా ఎగిరి వెళ్లి ఉష వళ్లోపడి 'సెటిల్' అయి పోయింది. ఉక్రోషంతో పళ్లు పటపట లాడించింది ఉష. అందరూ ఫక్కున్నవ్వే



# పాపం పైలట్

సరికి హెల్ప్‌లెస్ అయిపోయింది ఉష.

'హలో పింగ్‌పాంగ్‌బాల్ —' అని, ఒక్క క్షణమాగి 'ఇచ్చేయరా?' అంటూ వాక్యాన్ని పూర్తిచేసిన గోపాలంమీదకు కసిదీరా 'బాల్'ను విసిరికొట్టింది ఉష. 'క్యాచ్'మని పట్టుకొన్న గోపాల్‌వి— 'వెల్ క్యాచ్!' అంటూ బృందం అభినందించింది.

'హా అప్లీయుఅర్, మై డియర్ పింగ్‌పాంగ్‌బాల్!' అంటున్న 'పైలట్'ని చురచురా చూసి, 'కమాన్ లెట్స్‌గో అవుట్!' అంటూ చివ్వున లేచి బైటికి వెళ్లిపోయింది ఉష.

'గ్రేండ్ సక్సెస్‌బాస్!' అంటూ గోపాలాన్ని 'చేతులు పడేసారు' మిగిలిన బాబ్జీలు, బైటికొచ్చేక.

పక్కనేఉన్న 'లైటుపోలు' ఎక్కేయాలన్నంత ఉషారు పుట్టుకొచ్చింది గోపాలాన్కి.

* * *

'అబ్బబ్బబ్బా! నా ప్రాణం తీసేస్తున్నాడే ఈ పైలట్టు! హాస్టలొదిలి అడుగు బైటికి పెడ్తే చాలు— ఎదురుగా ప్రత్యక్షం! బీచ్‌కెళితే, అక్కడ నాకంటె ముందే తయారు, సినిమాకెడితే - అదే వెటో నాప్రక్కనో, సరిగ్గా వెనకాలో ఏర్పాటైపోతాడు. సిటీబస్సుల్లో—స్కూటరెక్కడో పారేసి—నాముందే ప్రత్యక్షమైపోతుంటాడు. రోజూ కేంటిన్ దగ్గర మామిడి చెట్టుకింద నిలయ విద్వాంసుడిలా కన్పడ్తుంటాడు. కోతిక కొబ్బరికాయ దొరికినట్టు ఆ స్కూటరొకటి! దాని సైలెన్సర్ తీసేసి నానాగోలానూ! దానికి తోడు విపరీతమైన స్పీడూ, పోజూనూ! ఎప్పుడో గురుడికి ఏ ఏక్సిడెంట్ అయినా ఐతేగాని తిక్క కుదరదు. మళ్లీ మరి విర్రవీగ్యడు! ఏ కాలో చెయ్యో పోతేగాని ఇటువంటాడికి రోగం కుదరదు —' పళ్లు పట పట లాడిస్తూ శపించసాగింది ఉష.

'ఊరుకోవోయ్, మరీ అంత దారుణంగా కాలో చెయ్యో పోవాలని శాపనార్థాలు పెట్టాక్ ఛీ ఛీ!' ఉషను కోప్పడింది శాంతి.

'ఏకు తెలీదోయ్. వాడికి అలాగే అవ్వాలి. లేప్పోతే బుద్ధి రాదు!' కసిగా అన్నది ఉష.

'పోన్లే, అప్పుడానందిద్దూగాని! ఏదో కాస్త ఉషారుగా అల్లరి చేసినంత మాత్రాన అంత ఘోరంగా, అసహ్యంగా శాపనార్థాలు పలికేయడమే? అసలు అందంగా అల్లరి చేయడం కూడా ఆర్టేనోయ్, తెల్సా?'

'ఔనౌను! అలాగే అందంగానో, అసహ్యంగానో అల్లరి కొనసాగించమను, మనం వెళ్లిపోయేలోగా వాడు స్కూటర్ మీదనుంచి గ్యారంటీగా బోల్తా కొడ్తాడు! ఒక్కసారి గట్టిగా అలా అవ్వాలి!'

ఉష మాటలు వింటూ మరి కాస్త విసుక్కుని, 'అస్తమానం 'వాడూ, వీడూ' అని అంటావేమిటి, మరీ లేబర్ లాగ!' అని మందలించింది శాంతి.

'మనల్ని మాత్రం వాళ్లల్లో వాళ్లు 'అదీ, ఇదీ' అని అనుకోరనా నీ ఉద్దేశ్యం? మరేం ఫర్వాలేదు—'వాడూ వీడూ'అంటే వాళ్ల పరువేం తరిగిపోదు!' అంటూ మూతి ముడుచుకొన్నది ఉష.

* * *

'ఏడిపింపు'తో ప్రారంభమైన పరిచయం గోపాలాన్కి పెద్ద ప్రోబ్లమైపోయి కూర్చుంది. ఏదో విధంగా ఉషకి రోజూ వీలైనన్ని ఎక్కువసార్లు 'అటెండెన్సు' వేయాలి. కన్పడినప్పుడల్లా ఏడ్పించడమో, కవ్వించడమో చేయాలి. లేకపోతే రోజు గడవడం కష్టం!'—ఇలా అలవాటు పడిపోయిన గోపాలానికి సర్వం 'ఉషమయం' ఐపోయింది. దాంతో మిత్ర బృందంలో మాటల సిలబస్ మార్చిపారేసేడు. అంటే, 'విశేషాలేమిటీ?' అనడాన్కి బదులు 'ఉషేషాలేమిటీ' అనీ, 'విష్‌యూ గుడ్‌లక్'కు బదులు 'ఉష్ యూ గుడ్‌లక్' అనీ, 'ఉష కన్పడిందా?' అనడాన్ని 'ఉషోదయమైందా?' అనీ—సిలబస్‌లో మాడిఫైడ్ రెగ్యులేషన్స్ ప్రవేశబెట్టేడు. అంతటితో ఆగక, రోజూ మధ్యాహ్నం మిత్ర బృందంతో తను నిలబడేచోట ఉన్న లేత మామిడిచెట్టు తనే ఐనట్టూ, 'ఉష పాప' మాధవీలత అయిపోయినట్టూ వో చక్కటి కల కనేసి, ఆ కలలో మాధవీలతను మామిడిచెట్టుకు అల్లించేసి, మామిడి చెట్టును చిగిర్పించి, పూత పూయించేసేడు. అనక ఆ మామిడిచెట్టు లేత చిగుళ్లమధ్య వో కోయిలని కూర్చొబెట్టి, 'కుహూ, కుహూ' అని జ్ఞాపకమున్న ప్రేమ గీతాలన్నీ పాడించేసేడు. అంతటితో ఆగక ఉష ఏయే రోజున ఏయే 'డ్రెస్' వేస్తుందో, పర్మనెంట్ ఎడ్రస్ ఏవిటో, డేటాఫ్‌బర్తూ, వాళ్ల నాన్నారి కారు నెంబరూ, డోరు నెంబరూ —అన్నీ గడ గడా అప్పజెప్పేయగల జనరల్ నాలెడ్జ్' సంపాదించేసేడు.

ఒక రోజు ఉషతో 'మీ కారు నెంబరు ఇదీ, మీ డోరు నెంబరు ఇదీ!' అని చెప్పినపుడు, ముందు ఉష నిజంగానే ఆశ్చర్యపోయి, అనక తేరుకుని 'మొన్న మా కారుకీ, డోర్లుకీ రంగు వెయ్యించేవని మా ఫాదర్ రాసేరే. బహుశ, పెయింటరు ...మన...పైలట్‌గారేనేమో...!'అని పక్కనున్న శాంతి దగ్గర 'విట్టే'సేసరికి, గోపాలం కళ్లంటుకొన్నాయి! ప్రక్కనున్న 'గ్యాంగు' విట్టుని రీ డైరెక్ట్ చేసేయమని ఎంత బలవంతం పెట్టినా వినకుండా, 'లేదు గురూ, ఈ రోజునుంచీ 'ఉష పాప'ని ఏమీ అనను'...అన్నాడు ఫీలింగు మార్చేస్తూ.

'ఏం?' అని కసిరింది 'బ్యాచి.'

'ల...ల...'లవ్వు'!...' అన్నాడు వో సుబ్బారావు, 'లవ్వు' అనే మాటను నొక్కి పలుకుతూ.

గోపాలం 'లవ్వు'తో సిగ్గుపడిపోయాడు!

* * *

విపరీతమైన స్పీడుతో 'హాస్టలు వస్తుయిల బస్'ని 'వోవర్‌టేక్' చేసిన'పైలట్' స్కూటర్‌ను కిటికీ ప్రక్క సీట్లోంచి చూస్తూ 'ఈనేలేదో మూడింది—లేకపోతే చూడు, ఆ స్పీడూ!' అన్నది ఉష— శాంతితో.

అంతలోనే 'బస్'లో జనం అంతా ఒక్కసారి 'అరెరే!' అంటూ కంగారుగా అరవడం, బస్ ఆగిపోవడం, అందరి మెడల్లూ కిటికీలోంచి బైటకు తొంగి చూడడం జరిగిపోయినయ్!

'ఎల్లిన్ గార్డెన్' టర్నింగ్‌లో, ఎదురుగా వస్తున్న నెంబర్ వన్ బస్‌కు 'ఢీ' కొని, సగం నచ్చైపోయిన స్కూటరూ, ఆరడుగుల దూరంలో ఎగిరిపడి స్పృహ కోల్పోయిన 'పైలట్టూ'!

'ఈ స్టూడెంట్ కుర్రోళ్లని పట్టుకోలేమమ్మా! ఉఫ్, ప్రాణాలతో చెలగాటం!'

అంటూ బస్ స్టార్ట్ చేసేడు డ్రైవరు.

'మంచి పనైంది. లేకపోతే ఏవిటా పొగరూ?' కళ్ళజోడు కామాక్షి కామెంట్.

'రోజూ చూస్తున్నాంగా—వెధవ పోజూ వీడూను!'

'ఇలా వర్సగా నల్గురైదుగురికి అయితే గాని, ఈ స్కూటరుగాళ్ళకు బుద్ధి రాదు!'

చెయ్యో, కాలో తుక్కైపోయుంటుంది!'

'పాపం, ఊరుకోండే. అతను అంతల అన్‌కాన్సస్‌గా ఉన్నాడుట. అనవసరంగా మనం ఇలా—'

'ఎవడు చేసికొన్న ఖర్మ వాడే అనుభవిస్తాడు. కాస్త నెమ్మదిగా పోతే పోయిందేముందీ? లేకిస్ దగ్గర పోజెయ్యబోయేడు! వప్పులుడుక లేదు!'

—బస్‌లో ఎవరిష్టం వచ్చినట్టు వాళ్ళు కామెంట్ చేస్తుంటే మనసంతా వికలమైపోయింది ఉషకి.

'ఊఁ, నీ కోరిక తీరిందోయ్ ఉషా! ఆనందించు!' అన్నది శాంతి—కోపంగా. అనుకోకుండా కళ్ళలో నీరు తిరిగింది ఉషకి. 'ఏం, జాలి పుట్టుకొచ్చిందా? ఇన్నాళ్ళూ కోరుకున్నావ్‌గదా, అతని కాలో, చెయ్యో పోవాలని! నీ శాపం ఫలించింది, ఆనందించు. పార్టీ చేస్కో. కాస్త ఉషారుగా ఉంటే అల్లరి వెధవని, రౌడీ అని నానా మాటలూ అంటారు, లేకపోతే మబ్బుగాడని, 'మడ్డి' అని హేళన చేస్తారు. ఏం చేసినా ప్రమాదమే! అసలు నీ మూలంగానే అతనికి ఎక్సిడెంటయింది! ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా చూడకుండా, నువ్వు కూర్చున్నావని ఇటువైపే చూస్తుంటే సరిగ్గా ... ఏక్సిడెంటయిపోయింది! సెలిబ్రేట్ చేస్కో!' అంటూ గోపాలం మీద సానుభూతి చూపించింది శాంతి. మాట్లాడకుండా తలదించుకొన్నది ఉష.

ఆ రోజు మామిడిచెట్టు కింద పైలట్ బృందం లేదు! అక్కడ మౌనం రాజ్యం చేస్తుంటే, ఏదో వెలితి కొట్టొచ్చినట్టుగా కన్పడింది ఉష బృందానికి!

* * *

'పైలట్‌కి చాలా సీరియస్‌గా ఉందటోయ్, పాపం!'

'స్కూటర్ నుజ్జు నుజ్జైపోయిందిట!'

'ఆ నప్పి రాత్రి మన మెస్‌లో వడ్డిస్తారుట!'

'వెధవ జోకూ నువ్వూను! అవతల అతనికి సీరియస్‌గా ఉండి చావూ బ్రతుకూ సమస్య ఐతే, నువ్విలా దారుణంగా మాట్లాడ్తావేమిటోయ్?'

'ఎంతమంది చావడం లేదు, ఎంతమంది పుట్టడం లేదు? అందరి చావులకీ భోజనాలు మానేసి, ఏడవమంటావా?'

—హాస్టల్లో అమ్మాయిల మాటలు వినలేక చెవులు మూసికొని రూమ్‌లోకెళ్ళి పక్కమీద కూలబడిపోయింది—ఉష—'దీనంతటికీ తనే కారణం! తన మూలంగానే అతనికి ఈ ఏక్సిడెంట్ అయింది! దేవుడా, అతనికేం ప్రమాదం కలగకుండా చూడు తండ్రీ! ...ఔను! ఒక్కసారి హాస్పిటల్‌కెళ్ళి చూస్తే? ఎవరేమనుకొన్నా ఫర్వాలేదు. శాంతి రాగానే వెళ్ళాలి!' బాధగా నొసలు పట్టుకొని కళ్ళు మూసుకొన్నది.

* * *

'మెన్స్ స్పెషల్—ఫస్ట్‌ఫ్లోర్'లో లిఫ్టు దిగింది ఉష, శాంతితో కల్సి. చుట్టూ కలయజూసింది—పైలట్ ఫ్రెండ్స్ ఎవరైనా కన్పడతారేమోనని! ఎవరూ కన్పడకపోయేసరికి కంగారుగా 'స్టాఫ్‌నర్స్' దగ్గరికి పరుగెత్తింది.

'ఎక్స్‌క్యూజుమీ సిస్టర్! ఇక్కడ—పైలట్ రూమ్ నెంబరు...' అన్నది కంగారుగా.

'పైలట్టా? హూ ఈజ్ దట్?'—సిస్టర్ ఏమీ అర్థంకానట్టు చూసింది.

'ఐయామ్‌సారీ—అతని పేరు—మిస్టర్ గోపాల్! ఆఁ, స్కూటర్ ఏక్సిడెంట్!...' వణుకుతూన్న కంఠంతో చెప్పింది.

'హాఁ, ఆ కేసా! చాలా సీరియస్ కేసు! 'స్కల్ ఫ్రేక్చర్'—ఆపరేష నౌతుంది. ఇంకా రెండు మూడు గంటలు పట్టొచ్చు. కానీ, నో హోప్స్! ఇంతకీ మీరు అతనికేమౌతారు?'—అడిగింది సిస్టర్.

జవాబియకుండా శాంతితో కల్సి ఆపరేషన్ థియేటర్‌వైపు పరుగెత్తింది ఉష. 'ఔను! నేనేమౌతానతనికి? ఏమీ అవ్వను! అతని పాలిట మృత్యువుని! శనిని! దెయ్యాన్ని'—తనని తనే కసిదీరా తిట్టుకొన్నది.

'రక్తం చాలదట!' అన్నారెవరో ఆపరేషన్ థియేటర్ దగ్గర. తలలమీద చేతులు వేసుకుని, నీరసించిపోయిన ముఖాలతో నిశ్శబ్దంగా కూర్చునున్నారు—పైలట్ స్నేహితులు.

'ఏమండీ—గోపాల్ కెలా ఉందీ?' ధైర్యంగా అడిగింది ఉష. ఆశ్చర్యంగా అందరూ తలలెత్తి చూసి, 'ఛీ! దీనికంతా నువ్వే కారణం!' అన్నట్టు ముఖాలు ప్రక్కకు త్రిప్పుకొన్నారు.

'ఏమండీ—చెప్పరా, ప్లీజ్!' ప్రతిమాలింది!



'ఆ తో చెప్పారు డాక్టర్. బ్లడ్ చాలదట! మాదెవ్వరిదీ 'మేచ్' అవలేదు. ఆపరేషనింకా జరుగుతుంది. రక్తంకోసం 'బ్లండ్ బ్యాంక్' దగ్గర ప్రయత్నిస్తున్నారు!' అంటూ కళ్ళు తుడుచుకొన్నాడు గోపాల్ కుడిభుజంలా అల్లరిచేస్తే మురళీ.

'నేనూ ట్రై చేస్తా.' 'మ్యాచ్' అయితే నా 'బ్లడ్' తీసుకోమనండి — ప్లీజ్!' కళ్ళనీళ్ళు తుడుచుకొంటున్న ఉషనిచూచి విస్తుపోయారు గోపాలం స్నేహితులు.

'ఐతే బ్లడ్‌బ్యాంక్‌కి నడవండి!' అన్న మురళీ వెనకాల పరుగుతీసింది ఉష.

'అతను నీకేమవుతాడమ్మా?' అన్నాడు డాక్టరు, రక్తాన్ని పరీక్షిస్తూ.

'ఏం చెప్పాలో పాలుపోలేదు. నరాసంగా తలవంచుకొన్నది ఉష.

'ఐసీ! నాకు తెల్సింది. అందుకా మీకీ త్యాగం!'—ఏదో కనిపెట్టేసినట్టు నవ్వేడు డాక్టర్.

'ఉహ్, ఈ డాక్టర్లవి గుండెలుకావు, పాషాణాలు! ఈ టైములో విట్సు!'— కోపగించుకొన్నది ఉష.

'హాహో, అదృష్టవంతుడమ్మా మీ గోపాల్! నీబ్లడ్ అనుకోకుండా మ్యాచ్ అయింది.' డాక్టర్ ఆనందంగా అన్నాడు.

'క్విక్ డాక్టర్! ప్లీజు, అతనికెంత కావాలో అంత రక్తాన్నీ తీయండి. నాకేమైపోయినా ఫర్వాలేదు. అతన్ని బ్రతికించండి! ప్లీజ్!'

'నీ కెక్కువైన రక్తాన్ని మాత్రమే తీస్తామమ్మా! డోంట్‌వర్రీ—'

కళ్ళు మూసుకొని మరోసారి దేవుణ్ణి ప్రార్థించుకొన్నది ఉష—'అతనికేం ప్రమాదం లేకుండా చేయి భగవాన్' అని!

నిముషాలు గడుస్తున్నాయ్ ఉష కళ్ళు మూతలు పడ్డాయ్. 'చేయి కదపకమ్మా!' అన్నాడు డాక్టర్.

'డాక్టర్!' అన్నది ఉష, ఉలిక్కిపడి కళ్ళు తెరుస్తూ. చుట్టూ ఎవరూ లేరు. శాంతికూడా లేదు. కంగారుగా లేవబోయింది. కళ్ళు తిరిగినట్లైంది. నీరసంగా, అలసట ఫీలయింది. అయినా లెక్కచేయకుండా రెండో ప్రయత్నంలో ఒక్క ఉదుటున లేచి ఆపరేషన్ థియేటర్‌కు పరుగెత్తింది. అక్కడా ఎవరూ కన్పడక పోయేసరికి భయంతో వణికిపోతూ స్పెషల్ వార్డుకు పరుగెత్తింది.

'సిస్టర్ సిస్టర్! స్కూటర్ ఏక్సిడెంట్ గోపాల్—ఆపరేషన్—ఏమైందీ?' బొంగుపోయిన కంఠంతో ఉష.

'బ్లడ్‌ఇచ్చిన అమ్మాయి మీరేనామ్మా?' తాపీగా అడిగింది సిస్టర్.

'యస్, సిస్టర్ అతనికెలా వుంది; రూమ్ నెంబరెంత! ప్లీజ్!...'

'రూమ్‌నెంబర్ 'టూ' గానీ,...'

'చెప్పండి సిస్టర్...ప్లీజ్!'

'అతనిబాడీ 'మార్చురీ' రూమ్‌కి వెళ్ళిపోయిందమ్మా!...'

'సిస్టర్! నిజమేనా?' కూలబడిపోయింది ఉష.

'ఔనమ్మా, ఆపరేషన్ సగంలో ఉండగానే ఆయుషు నిండిపోయింది!' ముఖం ప్రక్కకు తిప్పుకొన్నది సిస్టర్.

'మార్చ్యురీ' వైపు పరుగెత్తింది ఉష. అక్కడ గోపాల్ స్నేహితులంతా ఉబికి, ఎర్రబడిపోయిన కళ్ళతో జీవచ్ఛవాల్లా నిల్చుండిపోయి కనబడ్డారు.

'స్ట్రెచర్'మీద శవానికి తెల్లదుప్పటి పూర్తిగా కప్పి, 'అంబులెన్స్'లో కెక్కిస్తున్నారిద్దరు స్నేహితులు.

'గో...పా...ల్!' అంటూ కెవ్వున కేక వేసింది ఉష.

* * *

'ఏయ్, ఏమిటా కేక? ఏమైందీ?' అంటూ ఉషని బలంగా కుదిపివేస్తూ లేపింది శాంతి.

భయంగా లేచి కూర్చుని 'పైలెట్ చచ్చిపోయేడే!...' అన్నది ఉష.

'ఛ, పాడుమాటలూ, నువ్వూను! ఏదో పీడకల వచ్చినట్టున్నది. లే! హాస్పిటల్‌లో 'రికవర్' అవుతున్నాట్ట! చేతికీ, కాలికీ చిన్న చిన్న దెబ్బలు తగిలినయ్యట. స్కూటరుమాత్రం తుక్కైపోయిందట. ఇందాక వాళ్ళ ఫ్రెండుని జంక్షన్‌దగ్గర అడిగితే చెప్పేడు.' అన్నాది శాంతి.

'ఒకసారి వెళ్ళిచూడాలని వుందోయ్ శాంతి!' మెల్లగా అన్నది ఉష.

'ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో!' క్రీగంట చూసింది శాంతి.

'అనుకుంటే అనుకోనియ్ నామూలంగానే కదా పాపం, పైలట్‌కి ఇంత ప్రమాదమొచ్చింది!' వెళ్ళిచూస్తే తప్పేముందీ?'

'అయితే నడు! మెన్స్‌స్పెషల్ రూమ్ నెంబర్ టెన్ అట!...' శాంతిమాట వింటూనే ఛంగున లేచింది ఉష.

* * *

నీటుగా తయారై చేతుల్లో ఏపిల్ పళ్ళసంచి పట్టుకొని వస్తున్న ఉషా, శాంతిలను చూసి ఎవరికోసమోలే!' అనుకొన్నారు గోపాలం బృందంలో సభ్యులు. కాని ఉష తిన్నగా రూమ్‌నెంబర్ టెన్ కొచ్చి 'పైలట్‌రూమ్—ఐమీన్—గోపాల్ రూము ఇదే కదాండీ!' అనడిగేసరికి గోపాలం ఫ్రెండ్సు నిలువునా కొయ్యబారిపోయారు!

స్వింగ్‌డోర్ తెరుచుకొని లోపలికెళ్ళింది ఉష.

ఎదురుగా— బెడ్‌మీద—యాపిల్‌పండు అలాగా కొరుకుతూ, చేతికి చిన్న బేండేజుతోనూ, నుదుట రెండు ప్లస్ మార్కు ప్లాస్త్రిలతోనూ — కూర్చుని హుస్కుకొంటున్న పైలట్!

ఉషను చూడగానే ఉలిక్కిపడి, సర్దుక్కూర్చున్నాడు గోపాల్.

'హలో, హౌ ఆర్‌యూ?' నవ్వుతూ అడిగింది ఉష, చేతిలో ఏపిల్‌పళ్ళు గోపాలం ప్రక్కనే పెడుతూ.

'ఎవర్ని, నన్నే?' నిజమో, కలో నమ్మలేక అడిగేసేడు గోపాలం, అటూ ఇటూ చూస్తూ.

'ఔను, మిమ్మల్నే అమ్మాయిలమీద విజిల్సేసినట్టు స్కూటర్‌మీద విజిల్సేస్తే ఏమౌతుందో తెల్సిందా? ఇకనైనా కాస్త స్పీడు తగ్గించండి!' సలహా ఉచితంగా ఇచ్చింది ఉష.

'మ్యాటరు తుక్కు అయిపోయిందిగా! ఇంక అప్పే!' అన్నది శాంతి.

'మరి మీరూ విట్నెయు కంటు మ్యాటర్‌ని ఇమ్ప్రూవ్ చేయించేనుగా. కొత్తగొమ్ముంది!' అన్నాడు గోపాలం. అంటూ నవ్వేడు. నవ్వినమూలంగా తలలో నరాలు కదిలినయ్ గామోసు! 'అబ్బా!' అని తలపట్టుకు కూర్చుండి పోయేడు.

ఎప్పుడూ ఉషారుగా, నవ్వుతూ, అల్లరిగా అరవైమైళ్ల స్పీడులో ఉండే స్ప్రైలట్ అలా 'డల్' అయిపోయేసరికి విపరీతమైన జాలి పుట్టుకొచ్చేసింది ఉషకి. 'పాపం సైంట్లు!' అన్నది శాంతి చెవిలో.

'మీరు మెల్లగా ఏదో విట్మేస్తున్నారు!' అన్నాడు గోపాలం.

'అబ్బెబ్బె—లేదు. ఇంద, ఈ ఏపిల్సు తీస్కోండి. హేపీగా రికవర్ అవండి.'

'ఉ ఉహుఁ, నా కొదు!' మారాం చేసాడు గోపాలం.

'తీస్కోమంటుంటే!' కోప్పడింది ఉష.

'మీకు చెరొకటీ, నాకొకటీ!' బేరం పెట్టేడు గోపాలం.

'హోకే!...ఇంక మేం వెళ్లిపోమా?' కళ్లు చక్రాల్లా తిప్పింది ఉష.

'వొద్దు!' ముద్దుగా అన్నాడు గోపాలం.

'బావుంది వరస! వెళ్లొస్తాం—'

'వెళ్లొస్తారా, ఎంత సేపట్లో?' ఉషారుగా గోపాలం.

'విట్నెయ్యకండి, గుడ్ నైట్'— వెనక్కు తిరిగిన ఉష.

'ఉషా—' గోపాలం.

'ఊఁ?'— ఉష.

'నా కాలూ, చెయ్యీ విరిగిపోవాలని శపించేరుటగ, నిజంగా విరిగిపోతే—'

'ఉష్!' అంటూ గోపాలం పెదిమల మీద చూపుడువేలు పెట్టింది ఉష.

'ఉష్' అయిపోయాడు గోపాలం— ●

# చుంచు

చుంచు : షేక్స్పియర్ "చుంచును లొంగదీయడం" అని ఒక చక్కని నాటకం రాసాడు. చుంచు తత్వానికి ఎంత ప్రాముఖ్యం ఇచ్చాడో దీన్నిబట్టి తెలుస్తుంది. చుంచులు సామాన్యంగా మన ఇళ్లల్లో సంచరిస్తూనే వుంటాయి. ఎక్కువగా రాత్రిపూట ఎలక లాగే తిరుగుతూ ఉంటుంది. కాని ఇది చాల చురుగ్గాను, గోప్యంగాను, తిరగడం వల్ల అంత తరుచు కనబడదు. దాని ముట్టె పొడవుగా ముందుకు పొడుచుకొని వచ్చి ఉంటుంది. కీచ్, కీచ్ మని అరుస్తూ తిరుగుతూంటుంది. ఆహారాన్ని దాని ముట్టె సహాయంతోనే తెలుసుకొంటుంది. ఆ ముట్టె ఇటూ అటూ కదుల్తూ ఉంటుంది.

చుంచు చెవులు, కళ్లు చిన్నవి. తోక పొట్టిగా, దాని మీద వెంట్రుకలు పల్చగా ఉంటాయి. చుంచుల జాతుల్లో కొన్నిటికి దుర్గంధం వెదజల్లే స్రావగ్రంధి ఉండడం వల్ల సాధారణంగా మాంసాహారులు దీని మీదకు రావు. పిల్లి వాటిని చంపుతుంది కాని తినదు! పాపం! ఎటూ ఉపయోగంలేని స్థితి.

చుంచులు చాలా జాతులున్నాయి. వాటి తత్వం కూడా వేరుగా ఉంటుంది. మడగాస్కరులో టెన్‌రెక్ అనే చుంచుకాటు బాధ పెడుతుంది. అమెరికాలో బ్లేరినా అనే చుంచు విషపూరితం కూడా. దాని విషం అది తినే జంతువుల మీద బాగా పని చేస్తుంది. మనకు ప్రమాదం చెయ్య లేదు. కొన్ని జాతులు చెట్ల మీద, కొన్ని నీళ్లలోనూ ఉంటాయి. ఐర్లండులోని ఒక చుంచు 5, 6 సెం మీ. మాత్రం ఉంటుంది [తోకతో సహా]. ఇంత చిన్నస్తన్యజీవి వేరే లేదు.

ఇక ఆహారం విషయంలో చుంచు ప్రజ్ఞ విపరీతం. బహు చురుకుదనంతో తన ఆహారాన్ని నిత్యం వేటాడుతూ ఉంటుంది. పురుగూ, పుట్రా దీని ఆహారం. చిమ్మెట, బొద్దింక, వానపాము, నత్త ఇంకా ఇలా చాలా జంతువులు దీనికి ఆహారం. తన కన్నా పెద్దదయిన ఎలకని కూడా చంపి తినేస్తుంది. నీటిలో నివసించేవి చేపల్ని తింటాయి. చుంచుకు ఆకలి అధికమయి అవసరమైతే తన జాతి చుంచు తోటే పోరాడి చంపి తినేస్తుంది [స్వజాతి భక్షణ] కొద్ది గంటల పాటు ఆహారం లేకపోతే చాలు ఆకలితో చచ్చిపోతాయి. ప్రతి మూడు, నాలుగు గంటలకి తనపాటి బరువు తిండి కావాలి దానికి. దాన్ని బట్టి మనం ఎంత తక్కువ తింటున్నామా అనిపిస్తుంది. దీని జీవ వ్యాపార క్రియలు అంత చురుగ్గా సాగుతూంటాయి అన్నమాట.

చుంచు తన పిల్లల్ని ఆహారం కోసం తీసికొని పోవడం చిత్రంగా ఉంటుంది. తల్లి తోకనో వెంట్రుకనో నోటిలో బట్టి ఒకపిల్ల, ఈ పిల్లని బట్టి మరొకటి వెనక, అలా దాని పిల్లలన్నీ సుమారు ఒక అరడజను వరకు పోతూ ఉంటాయి. నేలని త్రవ్వి కాని, బయటనే కాని సులభంగా దొరికే వానపాములు ఈ చిన్నవయస్సులో నాటికి ఆహారంగా ఉపయోగపడతాయి. చిన్నపిల్లల ఆటరైలు బండిలా పోతూ ఉంటాయి.

ఎలకలుంటే ఇబ్బంది గాని, చుంచులు ఒకటి రెండు ఉంటే మన ఇంట్లో సదు పాయంగానే ఉంటుంది కదా!